స్పెషల్ బాదుడు ఇంకెన్నాళ్లు?

- దసరా ముగిసినా బస్సుల్లో అధిక చార్జీలు

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక బస్సుల పేరుతో టీజీఎస్ఆర్టీసీ నిలువు దోపిడీకి పాల్పడుతున్నది. దసరా పండుగ ముగిసిన తర్వాత కూడా స్పెషల్ బస్సులు అంటూ రేట్లు పెంచి ఇప్పటికీ అమలు చేస్తున్నారు. మాములు రోజుల్లో మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు రూ.290 చార్జీ ఉండగా, దసరా సందర్భంగా స్పెషల్ బస్సుల పేరుతో అదనంగా రూ.70లను ఆర్టీసీ వసూలు చేసింది. ప్రస్తుతం మరో రూ.40 పెంచి రూ.110లు అదనంగా వసూలు చేస్తున్నది. ప్రస్తుతం మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు టికెట్ ధర రూ.400 వసూలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ ప్రయాణికుడు టికెట్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది వైరల్‌గా మారింది. ఈ విషయంపై ఆర్టీసీ ఉన్నతాధికారులను సంప్రదించగా ..దసరా ముగిసిన 48 గంటల్లోనే స్పెషల్ బస్సులను రద్దు చేశామని చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం.

హామీల అమలుపై ఆర్టీసీ ఉద్యమం

- ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల్లో హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వంతో తేల్చుకునేందుకు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు సోమవారం హైదరాబాద్‌లోని టీజీఎస్ ఆర్టీసీ జాక్ ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. టీజీఎస్ ఆర్టీసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కన్వీనర్ ఎండీ మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్, యాదగిరి పాల్గొని ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. నవంబర్ 5న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే డిసెంబర్ 5న 'చలో సెక్రటేరియట్' కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

అగ్నిమాపక శాఖలో 'రిమోట్ ఆపరేటింగ్ లైఫ్‌బాయ్స్'

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ అగ్నిమాపకశాఖ కొత్త రెస్క్యూ సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నది. ఆధునిక రిమోట్ ఆపరేటింగ్ లైఫ్‌బాయ్స్‌ను కొనుగోలు చేసింది. వాటి ద్వారా ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా ఉండేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు ఆ శాఖ డీజీ వై నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాటితో అగ్నిమాపక సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి 258 మంది సిబ్బందికి, 15 మంది అగ్నిమాపకశాఖ అధికారులకు వాటర్ రెస్క్యూ ఆపరేషన్, బోటు ఆపరేషన్స్, రిమోట్ లైఫ్‌బాయ్స్, ఇతర రెస్క్యూ ఆపరేషన్లలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్టు వివరించారు. కరీంనగర్‌లోని లోయర్ మానేర్ డ్యామ్, గోదావరి నది, భద్రాచలం, హుస్సేన్‌సాగర్, హైదరాబాద్‌లో శిక్షణ నిర్వహించినట్టు వెల్లడించారు. వాటర్ రెస్క్యూలో అగ్నిమాపకశాఖ నుంచి 90 మంది ఎస్డీఆర్ఎఫ్‌లో శిక్షణ పొందినట్టు చెప్పారు.

రైతు సంక్షేమ కమిషన్ సభ్యుల నియామకం

హైదరాబాద్, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే కమిషన్ చైర్మన్‌గా కోదండరెడ్డిని నియమించిన ప్రభుత్వం తాజాగా ఏడుగురు సభ్యులను నియమించింది. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, న్యాయవాది సునీల్ కుమార్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గడుగు గంగాధర్, కేవీ నర్సింహారెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, మారికంటి భవానీలు సభ్యులుగా నియామకమయ్యారు.

త్వరలో సమగ్ర కులగణన

- గవర్నర్‌ను కలిసిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

హైదరాబాద్, అక్టోబర్21 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ కోసం రాష్ట్రంలో త్వరలోనే అన్ని కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమగ్ర సర్వేను నిర్వహించనున్నామని గవర్నర్ జిష్టుదేవ్‌వర్మకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ వివరించారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను సోమవారం కలిసి సర్వే షెడ్యూల్ వివరాలను అందజేశారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కు అవమానం

- అమరవీరుల సంస్మరణకు ఆహ్వానించి.. హౌస్ అరెస్టు
- ప్రభుత్వ తీరుపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం
- నేనేమైనా టెర్రరిస్టునా?.. నివాళులర్పించే అర్హత నాకు లేదా? అంటు మండిపాటు
- 'ఇదెక్కడి న్యాయం' అని ప్రశ్నించిన కేటీఆర్

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇంటి వద్ద పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): నిబద్ధత కలిగిన ఐపీఎస్ అధికారిగా పేరు తెచ్చుకున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ప్రభుత్వం అవమానించింది. సీనియర్, మాజీ ఐపీఎస్ అధికారిగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి రావాలని ఆహ్వానం పంపించి.. ఆ కార్యక్రమానికి హాజరుకాకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. దీనిపై సోమవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పరేడ్‌కు ఆహ్వానించి, రాత్రి నుంచే గృహనిర్బంధంలో ఉంచారు తెలంగాణ డీజీపీ గారు. విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసు సోదరులకు నివాళులు అర్పించే అర్హత నాకు లేదా? నేనేమైనా టెర్రరిస్టునా? సీఎం రేవంత్‌రెడ్డి గారు, మేమంటే ఎందుకింత భయపడుతున్నారు? ఎన్నాళ్లీ అరాచకాలు?' అంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా హౌస్ అరెస్టు చేసిన ఫొటోలు, ఇంటి ఎదుట రాత్రింబవళ్లూ పహారాలో ఉన్న పోలీసుల ఫొటోలను, పోలీసు శాఖ నుంచి వచ్చిన ఆహ్వాన ప్రతులను షేర్‌చేశారు. పోలీసుల అవమానకరమైన ప్రవర్తనపై నెటిజన్లు రీ ట్వీట్లు, కామెంట్లతో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

ఇదెక్కడి దుర్మార్గం?: కేటీఆర్

మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అక్రమ హౌస్ అరెస్ట్‌పై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ 'మా నాయకుడు అడిషనల్ డీజీ ర్యాంకు కలిగిన అధికారి. పోలీసు సేవల్లో ప్రెసిడెంట్ మెడల్ తీసుకున్నారు. పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించేందుకు ఆహ్వానించి.. వారే ఆయన్ని హౌస్ అరెస్టు చేశారు. ఇదీ వీరి గొప్పతనం. ఇంతకంటే ఏం చెప్పాలి. ఇదెక్కడి దుర్మార్గం.' అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

ఆహ్వానించి అరెస్టు చేస్తారా? : హరీశ్‌రావు

బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అక్రమ అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. 'ఆహ్వానించింది మీరే.. అరెస్టు చేసింది మీరే.. ఒక రిటైర్డ్ ఐపీఎస్ అధికారిని పోలీసు అమరవీరుల దినోత్సవం రోజే అవమానించడం సిగ్గుచేటు. పోలీసులపై మీ కపట ప్రేమకు ఇది మరో నిదర్శనం రేవంత్‌రెడ్డి గారు. ప్రజల ఆకాంక్షలు తీర్చేందుకు ప్రభుత్వాలు పనిచేయాలి గానీ, ఇలా నిర్బంధాల పాలన చేయడం దుర్మార్గం.' అని ఎక్స్‌లో తెలంగాణ సీఎంవోను ట్యాగ్ చేశారు.

ట్రా'ఫికర్' పరిష్కారానికి ఏఐ

- ముత్యాలమ్మ గుడిపై దాడి దురదృష్టకరం
- విధుల్లో పోలీసులు చనిపోతే కోటి పరిహారం ఇస్తాం
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- రంగారెడ్డిలో 50 ఎకరాల్లో పోలీస్ స్కూల్‌కు శంకుస్థాపన
- హోంగార్డుల ఊసెత్తని సీఎం

పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఉపయోగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. శాంతిభద్రతలు లేని ప్రాంతంలో పెట్టుబడులు రావని, తెలంగాణలో పోలీసులు శాంతి భద్రతలను ఏమాత్రం వైఫల్యం లేకుండా కాపాడుతున్నారని చెప్పారు. సోమవారం గోషామహల్‌లో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులందరికీ నివాళులర్పించారు. కేఎస్ వ్యాస్, పరదేశి నాయుడు, ఉమేశ్ చంద్ర, కృష్ణప్రసాద్ లాంటి వందలాది మంది పోలీసు అధికారులు అమరులై శాంతి భద్రతలను కాపాడటంలో స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. అందుకే పోలీసులు విధి నిర్వహణలో చనిపోతే రూ.కోటి వరకు పరిహారం అందించేలా పనిచేస్తామని చెప్పారు. పంజాబ్‌లో యువత డ్రగ్స్‌కు బానిసలయ్యారని, తెలంగాణ రాష్ట్రం కూడా విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటోందని చెప్పారు. ముత్యాలమ్మ గుడిపై దాడి సంఘటన ఆందోళనకరమన్నారు. నేరానికి పాల్పడిన వారిని అరెస్ట్ చేశామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ని 50 ఎకరాల్లో ప్రారంభించబోతున్నట్టు చెప్పిన సీఎం, సోమవారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, డీజీపీ జితేందర్, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, ఇంటెలిజెన్స్ డీజీ బీ శివధర్‌రెడ్డి, సీఐడీ డీజీ శిఖాగోయల్, ఏడీజీలు సంజయ్‌కుమార్ జైన్, మహేశ్‌భగవత్, స్టీఫెన్ రవీంద్ర పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన యూనిఫాం సేవా విభాగాలవారి పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తూ జీవో 72 జారీ అయింది.

హోంగార్డుల ఊసెత్తని సీఎం

పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసుల సేవలను కీర్తించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తమ సేవల గురించి కనీసం మాట్లాడకపోవడంపై హోంగార్డులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. చాలీచాలని జీతాలతో కష్టపడుతున్న తమ వెల్ఫేర్ గురించి సీఎం ఏదో ఒక శుభవార్త చెప్తారని ఆశించామని వాపోయారు. కానిస్టేబుళ్ల నుంచి ఐపీఎస్‌ల వరకు కోటి రూపాయల పరిహారం ఇస్తామన్న సీఎం.. తమ గురించి, తమ ఆర్థిక భద్రత గురించి ఒక్కమాట మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆది నుంచీ కోవర్టుల పేరుతో హోంగార్డులను నక్సల్స్ చంపుతున్నారని, వికారుద్దీన్ అనే ఉగ్రవాది చేతిలోనూ హోంగార్డు బాలస్వామి హైదరాబాద్ సిటీలో చనిపోయాడని, మిర్యాలగూడ ఫైరింగ్‌లో ఎస్సై సైదులుతో పాటు హోంగార్డు మహేశ్ చనిపోయాడని, వారి త్యాగాలు వృథాగా పోయినట్టేనా? అని ప్రశ్నిస్తున్నారు. 'ఎంత సర్వీసు చేసినా, మా ప్రాణాలంటే ప్రభుత్వానికి విలువ లేదా?' అని వాపోయారు.

ఉద్యమకారుడికి ఉద్యోగం ఊస్ట్!

- టీ శాట్‌లో పదేండ్లు ప్రొడక్షన్ మేనేజర్‌గా చేగొండి చంద్రశేఖర్
- ఉద్యోగం నుంచి తొలగించిన టీశాట్ యాజమాన్యం
- సీఎంవో ఆదేశాలు.. మేమేం చేయలేం అంటూ దౌర్జన్యం
- ఉద్యోగంలో చేర్చుకునేవరకు పోరాటమే అంటున్న చేగొండి
- సోషల్ మీడియాలో చేగొండికి మద్దతుగా నెటిజన్ల పోస్టులు

ఉద్యమ సమయంలో గాయపడ్డ చేగొండి చంద్రశేఖర్ (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): టీ శాట్‌లో పదేండ్లుగా ప్రొడక్షన్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తెలంగాణ ఉద్యమకారుడు చేగొండి చంద్రశేఖర్‌ను టీ శాట్ యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలిగించింది. ఆకస్మాత్తు నిర్ణయంపై ఆవేదనకు గురైన చంద్రశేఖర్ టీ శాట్ యాజమాన్యాన్ని సంప్రదించగా.. 'మీదేం తప్పులేదు. మీ పనితీరు అద్భుతంగా ఉంది. మీరు చాలా ముఖ్యమైన అంశాలపై పనిచేశారు. కానీ మేం ఏం చేయలేకపోతున్నాం. సీఎంవో నుంచి ఆర్డర్స్ వచ్చాయి. మిమ్మల్ని ఉద్యోగం నుంచి తీసేయాలని..'' అని సమాధానమిచ్చారు. తన ఉద్యోగాన్ని తీసేయాలని సీఎంవో నుంచి ఫోన్లు రావడంపై చేగొండి ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. సామాజిక, రాజకీయ అంశాలన్నింటిపై తన అభిప్రాయాలను సోషల్‌మీడియాలో ప్రజల ముందుంచేవాడినని.. నా పోస్టుల వెనక ఏ ఒక్క రాజకీయ పార్టీని విమర్శించిన దాఖలాలు లేవని..నా వల్ల సీఎంవోకు వచ్చిన నష్టమేంటో తెలియడంలేదని వాపోయారు. తనను ఉద్యోగంలో నుంచి తీసేసి సీఎంవో చెప్పిన వారిని విధుల్లో చేర్చుకోవడం జరుగుతుందని ఆరోపించారు. తాను ఏ తప్పు చేయనప్పుడు ఉద్యోగం నుంచి తీసేయడం సరికాదని ఆవేదన వ్యక్తంచేశారు. తిరిగి ఉద్యోగంలోకి తీసుకునే వరకు పోరాటం చేస్తానని చెప్పారు. మంచి లక్ష్యంతో ఏర్పాటైన టీశాట్‌లాంటి సంస్థలో రాజకీయాలు ప్రవేశించడం ఏ ఉద్యోగికి మంచిది కాదనీ.. అందరూ ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని చేగొండి చంద్రశేఖర్ సూచించారు. తన పోరాటానికి మద్దతు పలుకాలని ఆయన కోరారు.

ఉద్యమంలో కీలకం.. అందుకే ఉద్యోగం..!

తెలంగాణ ఉద్యమంలో చేగొండిది కీలక పాత్ర. హైదరాబాద్ నడిబొడ్డుపై సమైక్యాంధ్ర సభలు జరుగుతున్న ప్రతీ సందర్భంలో అక్కడికి వెళ్లి జై తెలంగాణ నినాదాలు చేస్తూ వాళ్లతో విచక్షణారహితంగా దాడికి గురైనవ్యక్తి. ఓ దశలో అతడిపై సమైక్యాంధ్ర వ్యక్తులు రక్త మొచ్చేటట్టు దాడి చేస్తే చావు అంచుల వరకు వెళ్లారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ప్రతీ ఉద్యమ కార్యాచరణలోనూ ఆయన పాల్గొన్నారు. సోషల్ మీడియాలో అతడికి వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. దావత్ విత్రౌట్ దారు ఏర్పాటు చేసి తాగుడు మానెయ్యాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. పీజీ గ్రాడ్యుయేట్...డిజిటల్ మీడియాలోనూ కంటెంట్ క్రియేటర్‌గా అనుభవం ఉంది. ఈ గుర్తింపుతోనే 2014లో టీ శాట్ యాజమాన్యం అతడిని ప్రొడక్షన్ మేనేజర్‌గా విధుల్లోకి తీసుకున్నది. వందలాది సామాజిక అవగాహన కార్యక్రమాలు చేశారు. ముఖ్యంగా మానసికపరమైన అంశాలపై మనస్తత్వ నిపుణులతో సుమారు 450కి పైగా టీశాట్‌లో ప్రోగ్రాంలు నిర్వహించారు. ఇప్పుడు ఆయనను విధుల నుంచి తప్పించడంతో చేగొండికి మద్దతుగా సోషల్ మీడియాలో నెటిజన్లు పోస్టులు చేస్తుండటం విశేషం. సీఎం రేవంత్ రెడ్డి ఇదేం పైశాచికత్వం అంటూ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



టూర్‌లో కాంగ్రెస్ సర్కార్

- 10 నెలల్లో 25 విదేశీ పర్యటనలు
- సీఎం సహా మంత్రుల విదేశీ టూర్లు

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను టూరింగ్‌గా మార్చింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పోటీ పడీ విదేశీ పర్యటనలు సాగిస్తున్నారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు 25సార్లు ప్రపంచంలోని ఆయా దేశాలను చుట్టి వస్తున్నారు. ప్రజాపాలన పేరుతో జనధనాన్ని విదేశీ పర్యటనల పేర ఖర్చుచేస్తున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల నుంచి ఎమ్మెల్యేలు, జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్ సహా అధికారులను వెంట బెట్టుకొని విదేశీయానం చేస్తున్నారు. పెట్టుబడులు, పరిసరాల విజ్ఞానం పేరుతో మంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్తున్నారు. ప్రభుత్వం తాజాగా దక్షిణ కొరియాలోని సియోల్ నగరంలోని చుంగ్ గై చున్ నదిని పరిశీలించేందుకు మంత్రుల బృందాన్ని పంపింది. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మితోపాటు అధికారుల బృందం సియోల్‌లో పర్యటిస్తున్నది.

రాసిపెట్టుకోండి.. 2028లో కేసీఆరే సీఎం

ప్రముఖ జ్యోతిష్యుడు ప్రశాంత్ కిని

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): 'జీవితంలో కష్టసుఖాలు సహజమే. కొంతకాలంగా రాజకీయంగా కష్టాలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు రానున్న రోజుల్లో మహర్దశ పట్టనున్నది. 2028లో తెలంగాణకు కాబోయే ముఖ్యమంత్రి ఆయనే' అంటూ ప్రముఖ జ్యోతిష్యుడు ప్రశాంత్ కిని జోస్యం చెప్పారు. ప్రస్తుతం రాహుకాలం కొనసాగుతున్న ఆయనకు త్వరలోనే శుభ గడియలు ప్రారంభం కానున్నాయని ఎక్స్‌లో పేర్కొన్నారు. పరిస్థితులు కలిసివచ్చి కేసీఆర్‌కు రాజయోగం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ప్రశాంత్ కిని చెప్పిన జోస్యం అనేక సందర్భాల్లో నిజమైంది. ఏపీ సీఎం చంద్రబాబు, జగన్ రాజకీయ భవిష్యత్తు, సినీ, వ్యాపార రంగాల్లోని సుప్రసిద్ధ వ్యక్తుల గురించి చెప్పిన అంచనాలు వాస్తవమయ్యాయి. ఆయనకు ఎక్స్‌లో 52 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. కిని ఎక్స్‌లో కేసీఆర్‌పై చేసిన పోస్ట్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నది. వేలాదిమంది నెటిజన్లు ఇది ము మ్మాటికీ కరెక్టేనని కామెంట్ చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలుచేయాలి

25 నుంచి మాదిగల ధర్మయుద్ధ మహాసభలు

హైదరాబాద్, అక్టోబర్21 (నమస్తే తెలంగాణ) : ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 25 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల్లో మాదిగల ధర్మయుద్ధ మహాసభలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ నేతలు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వర్గీకరణ లేకుండా టీచర్ పోస్టులను భర్తీ చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాదిగలకు ద్రోహం చేసిందని పేర్కొన్నారు. గ్రూప్-2, 3, 4, ఇతర ఉద్యోగాలు డిసెంబర్‌లో భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నదని, ఇది మాదిగజాతిని అణగదొక్కే చర్య అని, దీనిని మాదిగలంతా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

బాలుడి తల్లిదండ్రులకు రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న కేటీఆర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ఎమ్మెల్సీ పోచంపల్లి దాతృత్వం

బాలుడి చికిత్సకు 5 లక్షల సాయం • కేటీఆర్ చేతుల మీదుగా అందజేత

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. జన్యుసంబంధ వ్యాధితో బాధపడుతున్న బాలుడికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించి పేద కుటుంబానికి అండగా నిలిచారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ఆ మొత్తాన్ని అందజేశారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటకు చెందిన కుంభోజు మహేశ్వర్, అలేఖ్య దంపతుల కొడుకు మాధవన్ కొన్నేండ్లుగా జన్యు సంబంధిత గౌచర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. మీడియా ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆ బాలుడికి చికిత్సకోసం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. సోమవారం హైదరాబాద్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో బాలుడి తల్లిదండ్రులకు రూ.5 లక్షల చెక్కు అందించారు. తమ కొడుకు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తమ ఇంటికి వచ్చారని ఆరోజు తమ కొడుక్కి వ్యాక్సిన్ వేయించేందుకు హాస్పిటల్ వెళ్లామని బాలుడి తండ్రి మహేశ్వర్ తెలిపారు. తమను హైదరాబాద్ పిలిపించుకొని ఆర్థికసాయం అందజేసిన పోచంపల్లికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ వెంట స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఉన్నారు.

ఉద్యోగాలపై సీఎంది గోబెల్స్ ప్రచారం

- బీఆర్ఎస్ ఒక్క జాబ్ కూడా ఇవ్వలేదనడం హాస్యాస్పదం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాల భర్తీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోబెల్స్‌ను మించిపోయి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదనడం చెప్పడం హాస్యాస్పదమని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో లక్షా అరవై ఒక్కవేల పోస్టులు భర్తీ చేసిందినిజంకాదా? అని సోమవారం ఆయన ఎక్స్ వేదికగా నిలదీశారు. ఒక్క పోలీసు శాఖలోనే 31,731 ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మరో 16,337 ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ ఇచ్చామని, రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ సైతం పూర్తిచేశామని గుర్తుచేశారు. ఎన్నికల కోడ్ రావడంతో నియామక పత్రాలు ఇవ్వలేక పోయామని వివరించారు. ఆయా పోస్టులను తామే భర్తీ చేసినట్టు రేవంత్‌రెడ్డి గోబెల్స్ ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. 'పోలీసు అమరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులకు ఈ విషయం తెలియదనుకుంటున్నవా రేవంత్?' అని ఎద్దేవా చేశారు. 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు నిస్సిగ్గుగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలోనే హాల్‌టికెట్లు ఇచ్చి, పరీక్షలుపెట్టి, ఫలితాలు ప్రకటించారని, వంటంత అయినంకా వచ్చి గంటె తిప్పిన చందంగా సీఎం రేవంత్ వ్యవహారం ఉన్నదని విమర్శించారు. అబద్ధాలు చెప్తున్న రేవంత్‌రెడ్డిని నిరుద్యోగులు నమ్మబోరని, తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

మద్యం మార్కెట్‌పై మాఫియా నీడ!

- ఏరులై పారుతున్న ఎన్డీపీఎల్ మద్యం
- నెలకు రూ.500 కోట్ల మేర అక్రమ వ్యాపారం
- మామూళ్లకు మరిగిన ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది
- ఒక్కో బెల్టుషాపుపై 6 నెలలకు రూ.40వేల లంచం

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అక్రమ మద్యం ఏరులై పారుతున్నది. గ్రామాల్లో బెల్టు దుకాణాలు అక్రమ మద్యానికి అడ్డాగా మారుతున్నాయి. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్) దెబ్బకు డ్యూటీ పెయిడ్ మద్యం విక్రయాలు నేల చూపులు చూస్తున్నాయి. ఏకంగా 14 జిల్లాలో మద్యం విక్రయాలు పడిపోయి, రాబడి.. అంచనాల కంటే 20 శాతం తగ్గినట్టు ఎక్సైజ్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలోని డిస్టిలరీల యాజమాన్యంతో కుమ్మక్కైన మద్యం మాఫియా యథేచ్ఛగా ఎన్డీపీఎల్ మద్యం విక్రయిస్తున్న